
సాక్షి
నిర్మల్

గురువారం • 8 • మే • 2025



తలసేమియా చంపేస్తోంది!

ఉమ్మడి జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం పరిమిత సాయం అందిస్తుండగా బాధితులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 10లో▸



భలే మజా.. తాటి ముంజ

ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌కు వస్తున్న తాజా తాటి ముంజలు అందరి నోరూరిస్తున్నాయి. తక్కువ ధరకే లభిస్తుండటంతో జనం ఎగబడి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వేకువజామున చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



వడ్యాల్‌లో మాట్లాడుతున్న రాధిక

లక్ష్మణచాంద: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి రాధిక సూచించారు. బుధవారం మండలంలోని వడ్యాల్ రైతువేదికలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమై రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, ఎస్సై సుప్రియ, న్యాయవాదులు లింగాగౌడ్, రమణగౌడ్, వీడీసీ సభ్యులు రాంరెడ్డి, నరేశ్ రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టపెల్లి (కే) నర్సరీ సందర్శన

మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామ నర్సరీని సీనియర్ సివిల్ జడ్జి రాధిక సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న డ్రాగన్ ఫ్రూట్, వివిధ రకాల ఔషధ, పూల మొక్కలను చూసి సంతోషం వ్యక్తంజేశారు. నర్సరీ నిర్వాహకులను అభినందించారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఎంపీడీవో రాధ, పంచాయతీ కార్యదర్శి ప్రియాంకరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



రమేశ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అలీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా పర్యాటక అభివృద్ధికి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాండ్ అలీ బుధవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని కోరారు. జిల్లా కేంద్రంలో రమేశ్‌రెడ్డిని అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట చెరువు, వినాయకసాగర్, సోన్ మండలం పాక్‌పట్ల క్రొకోడైల్ పార్క్, శ్యామ్‌ఘడ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రమేశ్‌రెడ్డి జూన్‌లో సంబంధిత అధికారులను పంపించి అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు అలీ తెలిపారు.

'కర్రలతో ఇటుకలు కాల్చొద్దు'



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

సారంగపూర్: ఇటుకలు కాల్చేందుకు కర్రలు ఉపయోగిస్తే కఠినచర్యలు తప్పవని సారంగపూర్ డెప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ హెచ్చరించారు. మండలంలోని బీరవెల్లి, ప్యారమూర్ గ్రామాల్లోని ఇటుకబట్టీలను బుధవారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇటుకలు కాల్చేందుకు బొగ్గు, ఊక మాత్రమే వినియోగించాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఎస్వోలు రశీద్, ఫారూఖ్ అలీ, ఎఫ్‌బీవోలు భీమేశ్, మీనా, సంధ్య తదితరులున్నారు.

చెక్‌బౌన్స్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్

నిర్మల్‌చైన్‌గేట్: చెక్‌బౌన్స్ కేసుల కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.శ్రీవాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 9నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని ప్రతీ న్యాయస్థానంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వ పథకం కింద జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు సృష్టించినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు మేనేజర్ ఈడీ, అసిస్టెంట్ మేనేజర్ ఈడీసీ పోస్టులను కేటాయించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసే ఈ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు www.nimsme.gov.in ను సంప్రదించాలని, పూర్తి వివరాలకు జిల్లా మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం రూమ్ నంబర్ ఎఫ్-5, కలెక్టరేట్ (ఐడీవోసీ)లో సంప్రదించాలని సూచించారు.

హైబ్రిడ్ వరి.. రైతుకు సిరి



బొప్పారంలో హైబ్రిడ్ వరిలో బెరుకులు తీస్తున్న కూలీలు

- ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి
- రూ.10వేలు పలుకుతున్న ధర
- బొప్పారంలో 40 ఎకరాల్లో సాగు
- ఆదాయం ఆర్జిస్తున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: సోన్ మండలం బొప్పారం గ్రామ యువ రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. తక్కువ సమయంలో అధిక దిగుబడులు సాధించి స్ఫూర్తిదాయక విజయాన్ని నమోదు చేశారు. సంప్రదాయ వరి సాగుకు భిన్నంగా, హైబ్రిడ్ వరి సాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. బొప్పారం గ్రామానికి చెందిన 17 మంది రైతులు యాసంగిలో సంప్రదాయ వరి సాగుకు బదులు ఆడ-మగ 826 హైబ్రిడ్ వరి రకాన్ని 40 ఎకరాల్లో సాగు చేశారు. బెంగళూరుకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీ బై బ్యాక్ పద్ధతిలో ఈ



బొప్పారంలో సాగవుతున్న హైబ్రిడ్ వరి

విత్తనాలు రైతులకు సరఫరా చేస్తోంది.

సాగుకు సహకారం

రైతులకు ఎకరాకు రూ.20వేల పెట్టుబడి ఖర్చులు సదరు కంపెనీ ముందస్తుగా అందజేసింది. పంట సాగు నుంచి కోత దశ వరకు కంపెనీ ప్రతినిధులు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఒకవేళ పంట దిగుబడి తగ్గినా ఎకరానికి రూ.70,000 చెల్లిస్తామని ముందుగానే ఒప్పందం కుదుర్చుకున్నారు. కంపెనీ ఆడ విత్తనాలను కొనుగోలు చేస్తుండగా, మగ విత్తనాలను రైతులు స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించారు.

అధిక లాభాలతో విజయం

ఈ హైబ్రిడ్ వరి సాగు చేసిన రైతులకు ఎకరానికి 10-11 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాల్‌కు రూ.10వేల చొప్పున ఎకరానికి రూ.1.10లక్షల ఆదాయం వచ్చింది. రూ.25వేలు సాగు ఖర్చులు పోను రైతులకు రూ.85వేల లాభం లభించింది. సంప్రదాయ వరి సాగుతో ఎకరాకు రూ.20వేలు కూడా లాభం వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అన్నదాతలు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. కంపెనీ ప్రతినిధులు ఈ పద్ధతిని మిగతా రైతులు కూడా అనుసరించాలని కోరుతున్నారు.

నాలుగెకరాల్లో సాగు చేసిన



నేను యాసంగిలో 826 హైబ్రిడ్ వరి రకాన్ని నాలుగెకరాల్లో సాగు చేసిన. ప్రస్తుతం పంట కోసి అమ్మిన. నాలుగెకరాల్లో 46 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సాగు ఖర్చులు రూ.లక్ష పోనూ నాకు రూ.3.60 లక్షల ఆదాయం వచ్చింది.

– పెద్దోళ్ల గౌతమ్‌రెడ్డి, యువ రైతు, బొప్పారం

లాభసాటిగా ఉంది



నేను నూతన హైబ్రిడ్ వరిని రెండెకరాల్లో సాగు చేసిన. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సాగు ఖర్చులు పోనూ మంచి ఆదాయం వచ్చింది. హైబ్రిడ్ వరి సాగు చేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది.

– దావ మహేందర్, యువ రైతు, బొప్పారం

ఒప్పందం ప్రకారమే..



బొప్పారం గ్రామానికి చెందిన 17 మంది రైతులకు 45 ఎకరాలకు సరిపడా హైబ్రిడ్ వరి విత్తనాలు సరఫరా చేశాం. ఒప్పందం ప్రకారం పెట్టుబడి ఖర్చులు కూడా ఇచ్చాం. రైతులకు క్వింటాల్‌కు రూ.10వేల చొప్పున చెల్లించి ధాన్యం కొనుగోలు చేశాం.

– నాగరాజు, కంపెనీ ప్రతినిధి

నిర్మల్: జిల్లాకేంద్రంలోని త్రివర్ణ పతాకాలతో నినదిస్తున్న జిల్లావాసులు



సమర 'సిందూరం'

- ఉగ్రశిబిరాలపై భారత్ దాడులపై హర్షం
- దీటైన స్పందనకు జిల్లావాసుల మద్దతు
- జిల్లావ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- త్రివర్ణ పతాకాలతో ఊరూరా ర్యాలీలు

నిర్మల్: పచ్చని పహల్గాంలో 26మంది అమాయకుల నెత్తురు చవిచూసిన పాకిస్తాన్ ఉగ్రమూకలకు మంగళవారం కాళరాత్రిని చూపింది మన సైన్యం. 'ఆపరేషన్ సిందూర్' పేరిట ఉగ్రవాదుల పీచమణిచేందుకు చేపట్టిన సైనికచర్యపై యావత్ జిల్లా హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తోంది. మన యుద్ధ విమానాలు శత్రుదేశంలో బాంబులమోత మోగించాయన్న వార్త తెలిసిన మరుక్షణం నుంచే ప్రతిఒక్కరూ తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. జిల్లాకేంద్రంతో పాటు పలుచోట్ల బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు నిర్వహించారు. ఒకవేళ పాకిస్థాన్‌తో పూర్తిస్థాయిలో యుద్ధమే చేయాల్సి వస్తే.. సేవలందించేందుకు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామని మాజీ సైనికులు చెబుతుండటం విశేషం. 'ఆపరేషన్ సిందూర్'తో జిల్లాలో ఎటుచూసినా దేశభక్తి భావన ఉప్పొంగుతోంది. ప్రతిఒక్కరూ 'సైన్యానికి సెల్యూట్' అంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పలువురు ఆపరేషన్ సిందూర్‌పై తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

పిలుపు వస్తే మళ్లీ వెళ్తా



నిర్మల్: పహల్గాం ఘటనకు ప్రతీకారంగా శత్రుదేశానికి సరైన బుద్ధి చెప్పేలా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టడం హర్షణీయం. నేను 1993నుంచి 2014వరకు సైన్యంలో బ్లాక్‌క్యాట్ కమాండోగా, బాంబ్‌టెక్నీషియన్‌గా పని చేసిన. సైన్యం నుంచి పిలుపువస్తే మళ్లీ వెళ్తా.

– కొండాపురం ప్రభాకర్, రిటైర్డ్ హవల్దార్, కడెం

ఆర్మీది సాహసోపేత నిర్ణయం



ఖానాపూర్: పాక్ తీవ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ చర్యలను ప్రపంచ దేశాలు స్వాగతిస్తున్నాయి. సహసోపేతమైన నిర్ణయం తీసుకున్న భారత ఆర్మీకి సెల్యూట్. నేను ఆర్మీలో పని చేసిన. ఎప్పుడు పిలుపొచ్చినా మళ్లీ వెళ్తా. దేశ సేవకే నా జీవితం అంకితం.

– పాదం రాజన్న, రిటైర్డ్ కెప్టెన్, పఠాన్‌కోట్ (పంజాబ్)

ఇది భారతీయుల విజయం



నిర్మల్ రూరల్: ఉగ్ర స్థావరాలపై భారత్ ఆర్మీ దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టడం భారతీయుల విజయం. ఆపరేషన్ సిందూర్ 100 కోట్ల భారతీయులకు ఆత్మస్థైర్యాన్నిచ్చింది. భారత్ శక్తి, సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలియజేసే సమయం ఆసన్నమైంది.

– కూన ప్రదీప్, చార్టెడ్ అకౌంటెంట్, నిర్మల్

పాకిస్తాన్‌లో మూడునెలలున్న



నిర్మల్: నేను 38ఏళ్లు ఆర్మీలో పనిచేశాను. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినపుడు లాహోర్ ప్రాంతంలోనే ఉన్నాను. ఆనాటి యుద్ధంతో పాటు పలు దాడుల్లో పాల్గొనడం గర్వంగా ఉంది. పహల్గాం దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టడం హర్షణీయం.

– కూన చిన్ననర్సయ్య, రిటైర్డ్ సుబేదార్, నిర్మల్

'చెయ్యని పనులకు బిల్లులివ్వొద్దు'



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భైంసాటౌన్: చెయ్యని పనులకు బిల్లులివ్వొద్దని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాల మరమ్మతు పేరిట రూ.3.40లక్షలు, చలివేంద్రం పేరిట రూ.2లక్షలు, డ్రెయినేజీ పనుల పేరిట రూ.15లక్షలు బిల్లులు డ్రా చేశారని ఆరోపించారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, పట్టణంలోని పలు వార్డులతోపాటు కమలాపూర్ గుట్ట సమీపంలో డంపియార్డు వద్ద పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని చెప్పగా, తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాజేశ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు. తైబజార్‌కు బహిరంగ వేలం నిర్వహించాలని కోరగా, త్వరలోనే వేలం నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు కపిల్ సింధే, రావుల రాము, రావుల పోశెట్టి, సాహెబ్‌రావు, అనిల్, రాజన్న తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- కుంటాలలో రెవెన్యూ సదస్సు

కుంటాల: భూ సమస్యల పరిష్కారానికే భూభారతి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల రైతువేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి గ్రామాలవారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. భూ రికార్డుల్లో పేరు, విస్తీర్ణం లోపాలు, వారసత్వ భూములు, సాదా బైనామాలు, హద్దుల తగాదాల తదితర సమస్యల పరిష్కారానికి సదస్సులు ఉపయోగపడతాయని తెలిపారు. మండలంలోని



దరఖాస్తు పరిశీలిస్తున్న అభిలాష అభినవ్

రాయపాడ్, కుంటాల, వెంకూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 67 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు కమల్ సింగ్, ఎజాజ్‌అహ్మద్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, డీటీ నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వలు పేరుకుపోవడంపై ఆగ్రహం

మండలంలోని అందాకూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు పేరుకుపోగా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాకూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వసతుల లేమిపై అసంతృప్తి వ్యక్తంజేశారు. 40 కేజీల బస్తాకు మూడు కిలోలు కోత విధిస్తున్నారని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. కొనుగోళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం చేసినందుకు కుంటాల పీఏసీఎస్‌కు రూ.2లక్షల జరిమానా విధించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు కుంటాలలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: పెంబి మండలం గుమ్మెన కోలంగూడ గ్రామ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు 50 ఏళ్లుగా 100 కుటుంబాలవారమంతా ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి తాగడానికి నీళ్లు దొరికే పరిస్థితి లేదని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరారు. సీసీ రోడ్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ భూములకు లావుని పట్టా, అటవీ హక్కులు కలిగి ఉన్నా ఫారెస్ట్ అధికారులు గ్రామాభివృద్ధికి అడ్డుపడుతూ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గుమ్మెన కోలంగూడ గ్రామస్తులు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ వ్యతిరేక వైఖరి వీడాలి



మాట్లాడుతున్న ఎంసీ లింగన్న

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ వ్యతిరేక వైఖరి వీడాలని భారతీయ పెన్షనర్ల ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లపై వ్యతిరేక ధోరణితో సీఎం వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు ఇంటిముఖం పట్టాయని గుర్తు చేశారు. సంఘాలతో సత్వరమే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకుంటే తదుపరి పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ హన్మంత్‌రెడ్డి, యూనిట్ అధ్యక్షుడు పీ విలాస్, జిల్లా ఆర్థిక కార్యదర్శి లోలం గంగన్న, యూనిట్ కార్యదరి జనార్దన్, విశ్రాంత ఉద్యోగుల జిల్లా కార్యవర్గం, యూనిట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు మండలాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేసిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మల్ రూరల్ మండలంలో 35.03 ఎకరాలు (రూ.5.77 కోట్లు), భైంసా మండలంలో 18.31 ఎకరాలు (రూ.2.07 కోట్లు), నర్సాపూర్(జీ) మండలంలో 16 ఎకరాలు (రూ.2.04 కోట్లు), లోకేశ్వరం మండలంలో 12.25 ఎకరాలు (రూ.1.34 కోట్లు) మొత్తం 82 ఎకరాలు అన్యాక్రాంతం కాగా తిరిగి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ప్రక్రియ నునిరంతరాయంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని సీసీఎఫ్ శరవనన్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోతులు పట్టే బాధ్యత స్థానిక సంస్థలే తీసుకోవాలని సూచించారు. అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామని పేర్కొన్నారు. డీఎఫ్‌వో షేక్ ఆదం, నాగిని భాను పాల్గొన్నారు.

ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

భైంసాటౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎస్పీ డాక్టర్ జీ జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత స్టేషన్ ఆఫీసర్లతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. కుటుంబ కలహాల కేసులకు సంబంధించి పలు జంటలకు షీ టీం సిబ్బందితో కౌన్సెలింగ్ ఇప్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్న పట్టణ సీఐ జీ గోపీనాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సైలు శంకర్, గణేశ్, షీ టీం ఇన్‌చార్జి మహిళా ఎస్సై పెర్సిస్, సిబ్బంది, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జానకీ షర్మిల

న్యూ ఇండియా లిటరసీని విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల వారీగా నిరక్షరాస్యుల వివరాలు సేకరించి వారందరికీ కనీస విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా బాసర మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో మహిళా సంఘాల సహాయంతో నిరక్షరాస్యులను గుర్తించి వారికి విద్య నేర్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఇతర అధికారులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. విద్యా సేవకులుగా స్వచ్ఛందంగా పనిచేసేందుకు చదువుకున్న యువత, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బడి మానేసిన వారిని గుర్తించి ఓపెన్ పాఠశాలల్లో చేర్పాలని, చదువురాని వారికి పెద్దల విద్య ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, డీఆర్డీవో విజయలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి తిరుపతిరావు, మెప్మా పీడీ సుభాష్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, లింబాద్రి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

ఆదిలాబాద్‌టౌన్: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు రూ.4వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన షేక్‌అస్లమ్, కోకటి విజయ్ తమ మిత్రుడైన న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఇందూర్ గజానంద్ హెచ్‌ఎఫ్ డిలక్స్ బైక్ చోరీ చేయాలనే కుట్రతో ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు తీసుకెళ్లారు. కత్తితో గొంతు కోసి జైనథ్ శివారులోని వైఆర్‌కే కన్‌స్ట్రక్షన్ వద్ద పడేసి బైక్‌తో పరారయ్యారు. అప్పటి జైనథ్ ఎస్సై కేసు నమోదు చేసి నిందితులను విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. డ్యూటీ అధికారి జమీర్ 25 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ మేకల మధుకర్, రహీమ్ నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన: బాలికను ప్రేమపేరుతో పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకున్న నిందితుడికి పోక్సో కేసు కింద పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 60వేల జరిమానా విధిస్తూ బుధవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి తెలిపిన వివరాల మేరకు రెబ్బెన మండలం గోలేటికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన చునార్కర్ మహేందర్ అనే వివాహితుడు పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో 2019 ఆగస్టు 15న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై దీకొండ రమేశ్ కేసు నమోదు చేయగా డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి నిందుతుడిని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఎస్‌కే.లతీఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్(జి) మండలంలోని బామ్ని(బి) గ్రామానికి చెందిన లతీఫ్ పని నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై కుంటాలకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అంబకంటి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీ విస్తరణకు కృషి



గౌరవ వందనం స్వీకరిస్తున్న సునీల్ అబ్రహం

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎన్‌సీసీ విస్తరణకు కృషి చేస్తున్నామని ఎన్‌సీసీ నిజామాబాద్ గ్రూప్ కమాండర్ సునీల్ అబ్రహం అన్నారు. జిల్లా కేంద్రంలోని 32 టీ బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్‌కు మరో బెటాలియన్ మంజూరైందన్నారు. ఈ 38వ బెటాలియన్ ఏర్పాటైతే రిక్రూట్‌మెంట్ పెరుగుతుందన్నారు. ఆసిఫాబాద్ గ్రామీణ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో బెటాలియన్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కమాండింగ్ అధికారి వికాస్ శర్మ, ఎన్‌సీసీ అధికారులు గాలి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చంపేస్తోంది..!

ఉమ్మడి జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వం పరిమిత సాయం అందిస్తుండగా, దాతలు మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతోనే బాధితులు జీవనం సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల మందికి పైగా తలసేమియా బాధితులు ఉన్నప్పటికీ, ఖచ్చితమైన గణాంకాలు వైద్య ఆరోగ్య శాఖ వద్ద లేవు. ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– మంచిర్యాలటౌన్

- రక్తం ఎక్కించకపోతే ప్రాణాలకే ముప్పు
- బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పునర్జన్మ
- ఆరోగ్యశ్రీ ద్వారా అంతంత మాత్రంగానే సాయం
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న వ్యాధి
- నేడు ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం



మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా వ్యాధిగ్రస్తులు (ఫైల్)

తలసేమియా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే వ్యాధి. ఇది ఆల్ఫా మరియు బీటా అనే రెండు రకాలుగా విభజించబడింది, మైనర్, ఇంటర్మీడియెట్, మేజర్ అనే మూడు దశల్లో కనిపిస్తుంది.

మైనర్ తలసేమియా: ఒక ఆల్ఫా లేదా బీటా చెంజ్ తగ్గినప్పుడు సంభవిస్తుంది. ఈ దశలో రక్త మార్పిడి అవసరం లేదు, కానీ వ్యాధి తీవ్రత లేకపోయినా ఇది తదుపరి తరానికి సంక్రమిస్తుంది.

ఇంటర్మీడియెట్ మరియు మేజర్: హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) స్థాయిలు తగ్గడంతో ప్రతి 15 రోజులకోసారి రక్త మార్పిడి అవసరం. ఒక యూనిట్ రక్తం ఎక్కించడం ద్వారా హెచ్‌బీ స్థాయి ఒక గ్రాము పెరుగుతుంది. హెచ్‌బీ స్థాయి కనీసం 10.5 గ్రాముల వరకు నిర్వహించాలి.

అండగా రెడ్‌క్రాస్..

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ తలసేమియా బాధితులకు అత్యాధునిక సేవలు అందిస్తోంది.

హెచ్‌బీ ఏ2 పరీక్ష: వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌పీసీఎల్ మిషన్ అందుబాటులో ఉంది.

ఐరన్ చిల్లేషన్ మెడిసిన్: 15 యూనిట్ల రక్త మార్పిడి తర్వాత శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తగ్గించే మందులు అందిస్తున్నారు. సింగరేణి సంస్థ సహకారంతో సీబీఆర్‌ఎం మిషన్ సెలైన్ బాక్స్ అందుబాటులో ఉంది.

హెచ్‌పీఎల్‌పీ పరికరం: ఉట్నూరు మరియు మంచిర్యాలలో రక్త క్షీణతను గుర్తించే సాంకేతికత అందుబాటులో ఉంది. ఐరన్ స్థాయిలు పెరగడం వల్ల తలసేమియా బాధితుల జీవనకాలం 30 ఏళ్ల వరకు పరిమితమవుతోంది. సీరం అబార్ట్ ఐ 1000 ఎస్‌ఆర్ మిషన్ సింగరేణి సహకారంతో మంచిర్యాల రెడ్‌క్రాస్‌లో బాధితులకు ఉపయోగపడుతోంది.

ఆరోగ్యశ్రీ పరిమితులు

ఆరోగ్యశ్రీ ద్వారా నెలకు రూ.15 వేలు మాత్రమే మందుల కొనుగోలుకు అందుతోంది. రోజుకు 3-4 ఇంజెక్షన్లు (ఒక్కో ఇంజెక్షన్ రూ.300 వరకు) అవసరమవుతున్నాయి. ఈ ఖర్చును ఆరోగ్యశ్రీలో చేర్చితే నిరుపేదలకు ఊరట లభిస్తుంది.

వ్యాధి లక్షణాలు

తలసేమియా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. మైనర్, ఇంటర్మీడియెట్, మేజర్ మూడు దశల్లో ఉంటుంది. తలసేమియా ఆల్ఫా, బీటా రెండు రకాలు. ఒక ఆల్ఫా చెంజ్ కానీ, ఒక బీటా చెంజ్ తగ్గినప్పుడు మైనర్ వ్యాధి ఉన్నట్లు. వీళ్లు వ్యాధిగ్రస్తులైనప్పటికీ రక్త మార్పిడి అవసరం లేదు. వీరు వ్యాధి తీవ్రతతో బాధపడరు. కానీ వారి నుంచి వారి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. ఇంటర్మీడియెట్, మేజర్‌లో హిమోగ్లోబిన్(హెచ్‌బీ) తగ్గిన వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రోగి శరీరంలో ఒక యూనిట్ రక్తం ఎక్కిస్తే ఒక గ్రాము హెచ్‌బీ పెరుగుతుంది. హిమోగ్లోబిన్ మెయింటనెన్స్ కనీసం 10.5 గ్రాములు శాతం ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతీ 15 రోజులకోసారి వీరికి రక్తం అవసరం. జ్వరం రావడం, ఆకలి తగ్గడం, కామెర్లు, మూత్రం పసుపు రంగులో రావడం, ఇన్‌ఫెక్షన్ జరగడం, మనిషి ఎదుగుదల నిలిచిపోతుంది. హిమోగ్లోబిన్ తగ్గడంతో ఎముకల సాంద్రత తగ్గి ఎముకలు విరిగే అవకాశాలు ఉంటాయి. వ్యాధిగ్రస్తుల ఐరన్ సంబంధిత మందులు, ఆహార పదార్థాలు, వంటపాత్రలు వాడరాదు. కాల్షియం(ఎముకలను బలపరిచే) పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్

తలసేమియా బాధితులకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ శాశ్వత పరిష్కారం. సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో గత ఏడాది జిల్లాకు చెందిన ఆరుగురికి ఈ చికిత్స అందించారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు అయింది. కేంద్ర ప్రభుత్వం పీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షలు, బాధితులు రూ.2 లక్షల వరకు, మిగిలిన ఖర్చును సంకల్ప్ ఫౌండేషన్ భరించింది. 90% బాధితులు నిరుపేదలే కావడంతో, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ చికిత్సను అందిస్తే వ్యాధిని నిర్మూలించే అవకాశం ఉంది.

ప్రభుత్వ సాయం..

ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రమే తలసేమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇతర ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తుల గణాంకాలు అందుబాటులో లేవు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉచిత రక్త మార్పిడి సౌకర్యం ఉన్నప్పటికీ, ఇతర సేవలు అందించడంలో లోపాలున్నాయి.

ప్రభుత్వమే ఆదుకోవాలి



తలసేమియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పెళ్లికి ముందు హెచ్‌బీఏ 2 రక్తపరీక్షను చట్టబద్ధం చేయాలి. ఏజెన్సీ ప్రాంతంలోనే కాకుండా అన్ని ప్రాంతాల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి. ఆరోగ్యశ్రీద్వారా మందులతో పాటు, ఇంజక్షన్లు ఇవ్వాలి. యూడీఐడీ కార్డులు ఇవ్వాలి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రభుత్వమే చేయించాలి.

– కాసర్ల రంజిత్ కుమార్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



విత్తనాలు, నిందితులతో అధికారులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ పెద్దవాగు వద్ద బుధవారం 4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా బెల్లంపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబ్బారావు, పాలమరి సురేష్, రాచకొండ నగేశ్, ఇనుముల రవి రెండు కార్లలో తరలిస్తూ పట్టుబడ్డారు. విత్తనాల విలువ రూ.12 లక్షలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కార్లను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వెంకటేశ్, మధు, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తులతో పోస్టు పెట్టిన ముగ్గురి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో కత్తులతో పోస్టు పెట్టిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తాటిగూడకు చెందిన రాహుల్ జందాడే, క్రాంతినగర్‌కు చెందిన సయ్యద్ రిజ్వాన్, మహాలక్ష్మివాడకు చెందిన తైవర్ ఖాన్ కత్తులు పట్టుకుని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, యువత కత్తులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, రోడ్లపై పుట్టిన రోజు కార్యక్రమాలు నిర్వహించినా, కత్తుల ప్రదర్శన చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బక్కన్న

నెన్నెల: వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట వడగళ్ల వానకు దెబ్బతినడంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలాతీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన నిరుపేద కౌలురైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గంగారాం గ్రామానికి చెందిన కడారి బక్కన్న మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.2 లక్షల వరకు అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి వరిపైరు నేలకొరిగి వడ్లన్నీ నేలరాలాయి. దీంతో పంట పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని బాధితుని భార్య మమత ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది. ఘటనపై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



సాయినాథ్(ఫైల్)

నర్సాపూర్(జి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బూరుగుపల్లి(జి) అనుబంధ గ్రామమైన సూర్యం తండాకు చెందిన చవాన్ సాయినాథ్ (28) గతేడాది బొలెరో వాహనాన్ని ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. నెలనెలా కిస్తీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతుండేవాడు. ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య చవాన్ సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ..

లోకేశ్వరం: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన చిన్నవాయి సాయన్న (67)నిత్యం మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. బుధవారం మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో పశువుల పాకలోని రేకుల షేడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమార్కులను పట్టిస్తే రూ.10 వేల పారితోషికం

శ్రీరాంపూర్: సింగరేణిలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని పట్టిస్తే వారికి రూ.10 వేల పారితోషికం అందిస్తామని యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కంపెనీలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు, దళారుల ప్రమేయంపై కఠిన చర్యల్లో భాగంగా ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కంపెనీలో మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని, బదిలీలు చేయిస్తామని, ఉద్యోగాలు పెట్టిస్తామని కొందరు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొంది. ఇటీవల ఓ ఉద్యోగి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి డబ్బులు వసూలు చేసి ఏసీబీ చిక్కిన విషయాన్ని గుర్తు చేసింది. అమాయక ఉద్యోగులను మోసం చేస్తే ఉపేక్షించబోమని, అవినీతి వ్యవహారాలు చేసే వారు ఎవరైనా కఠిన చర్యలు ఉంటాయంది. పైరవీలు చేయిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగినా, అవినీతి వ్యవహారాలు చేసినా వారి సమాచారాన్ని కంపెనీ విజిలెన్సు లేదా ఏసీబీ అధికారులకు ఇవ్వాలని సూచించింది. ఇలాంటి వారికి పారితోషకం ఇవ్వడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

రుణాల మంజూరులో మంచిర్యాలకు అవార్డు

పాతమంచిర్యాల: బ్యాంకు లింకేజీలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎస్.కిషన్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7,982 గ్రామైక్య సంఘాలకు రూ.430 కోట్ల 28 లక్షలు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా 5,245 సంఘాలకు రూ.464 కోట్ల రుణాలు మంజూరు చేసి లక్ష్యాన్ని అధిగమించింది. దీంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో నేడు గురువారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో డీఆర్డీవో ఎస్.కిషన్, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత అవార్డు అందుకోనున్నారు. కాగా మంచిర్యాల జిల్లా మూడేళ్లుగా వరుసగా 2022లో ద్వితీయస్థానం, 2023లో తృతీయస్థానంలో నిలిచింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా నాలుగోస్థానంలో నిలవడంతో సెర్ప్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

జైనథ్: ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గిమ్మ గ్రామానికి చెందిన అద్దంకి సుభాష్ తన ఆటోలో నలుగురు ప్రయాణికులను ఎక్కించుకుని ఆస్పత్రికి వెళ్తుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. జైనథ్ ఎస్సై స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడలో గతనెల 28, 29 తేదీల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌కు చెందిన షేక్ మోబిన్, వాడే ఆకాష్, షిండే ఆకాష్ ఆదిలాబాద్ మహాలక్ష్మివాడలోని మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మరోసారి చోరీకి పాల్పడేందుకు బుధవారం జిల్లా కేంద్రానికి రాగా నిందితులను విచారించడంతో సెల్‌ఫోన్, రూ.20వేల నగదు, 9 తులాల బంగారం, 280 గ్రాముల వెండి అపహరించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం, 2 తులాల బంగారం, 80 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ పాల్గొన్నారు.

జనావాసాల్లోకి నీలుగాయి



జనావాసాల్లోకి వచ్చిన నీలుగాయి

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతి నగర్, విద్యానగర్, అర్బాత్ కాలనీల్లో బుధవారం నీలుగాయి సంచరించింది. దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన నీలుగాయిని ఊర కుక్కలు వెంబడించడంతో స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవో నరేందర్, బేస్ క్యాంప్ సిబ్బంది నీలుగాయిని బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు.


ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్



బైక్‌లు, నిందితులతో డీసీపీ, ఏసీపీ

జన్నారం: జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలని బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గిడి భాస్కర్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన కంచర్ల నరేశ్ మార్చి 5న మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ ఎదుట తన ఫ్యాషన్ ప్రో బైక్‌ను ఉంచి లోనికి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించకపోవడంతో 8న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఎస్సై రాజవర్ధన్ వాహనాలు తనిఖీ చేస్తుండగా దస్తురాబాద్ మండలం మల్లాపూర్‌కు చెందిన బత్తుల పరమేశ్, రెంకల నరేశ్ బైక్‌లపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. జన్నారం మండలం మురిమడుగుకు చెందిన సంపంగి రమేశ్, కలమడుగుకు చెందిన లావుడ్యా హరికృష్ణ , దస్తురాబాద్ మండలం మల్లాపూర్‌కు చెందిన కొట్టె బానేశ్‌లతో కలిసి ముఠాగా ఏర్పడి మంచిర్యాల, జగిత్యాల, బెల్లంపల్లి, జన్నారం ప్రాంతాల్లో 12 బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్దనుంచి ఫ్యాషన్‌ప్రో బైక్‌లు 5, హోండాషైన్ బైక్‌లు-2, స్పెండర్ ప్లస్ బైక్‌లు-2, ఫ్యాషన్ ప్లస్, హెచ్‌ఎఫ్ డీలక్స్, టీవీఎస్ స్టార్ స్పోర్ట్స్ బైక్‌లు ఒక్కొక్కటి స్వాధీనం చేసుకున్నారు. బత్తుల పరమేశ్, రెంకల నరేశ్, లావుడ్యా హరికృష్ణను అరెస్ట్ చేయగా కొట్టె బానేశ్ పరారీలో ఉన్నాడు. కాగా సంపంగి రమేశ్ వేరే కేసులో జైలులో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో గత నెల 30న నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. ఎంపికైన వారిలో శివాని (పెంచికల్‌పేట్), ఆత్రం ధనలక్ష్మి (మర్లవాయి), ప్రవీణ్ (బెజ్జూర్) ఉన్నారు.ఈనెల 9 నుంచి 11 వరకు తమిళనాడులోని ఆరని, తిరువన్నమలై పట్టణాల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను బుధవారం అభినందించారు.

9,10 తేదీల్లో వాలీబాల్ పోటీలు

రామకృష్ణాపూర్: ఈ నెల 9, 10 తేదీల్లో రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 20 టీమ్‌లు పాల్గొంటాయని, విజేతలకు ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలతో పాటు ట్రోఫీలను అందజేయనున్నారు.

క్లుప్తంగా

వేతనాలు పెంచాలని వినతి

భైంసాటౌన్: వేతనాలు పెంచాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కోరారు. బుధవారం ప్రత్యేకాధికారిగా మున్సిపాలిటీకి వచ్చిన ఆయనను కలిసి విన్నవించారు. అరకొర వేతనంతో ఇబ్బంది పడుతున్నామని వివరించగా, ఆయన వేతనం పెంచుతామని హామీ ఇచ్చారు.

వైభవంగా అమ్మవారి జయంతి



మంగళహారతులతో మహిళలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని కళానగర్‌లో కొలువైన శ్రీమాత నిమిషాంబిక ఆలయంలో అమ్మవారి జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు సముద్రాల శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో అన్నదాన చేపట్టారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

వాసవీ మాత..

దస్తురాబాద్: వాసవీ మాత జయంతి ఉత్సవాలను మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు నరేశ్ ఆచార్యుల ఆధ్వర్యంలో 108 నైవేద్యాలతో కుంకుమ పూజ చేశారు. కార్యక్రమంలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తికి జైలు

నిర్మల్‌చైన్‌గేట్: అప్పు తీసుకొని మోసం చేసిన దండి విజయ్ కుమార్ అనే వ్యక్తికి నిర్మల్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జోగిపల్లి భవిష్య ఆరు నెలల జైలు శిక్ష, రూ. 1,30,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. 2013లో బెజ్జంకి వెంకటేశ్వర మూర్తి అనే వ్యక్తి నుంచి రూ. 65,000లు తీసుకొని తిరిగి ఇవ్వలేదు. కేసును విచారించిన న్యాయమూర్తి శిక్ష విధిస్తూ.. తీర్పునిచ్చారని న్యాయవాది లోకా లక్ష్మారెడ్డి తెలిపారు

చేపల వేటకు అనుమతి ఇవ్వండి



మాట్లాడుతున్న మత్స్యకారులు

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పరిధిలోని రాంపూర్ గ్రామ మత్స్యకారులకు గోదావరిలో చేపల వేటకు అనుమతి ఇవ్వాలని కోరారు. బుధవారం రాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాతాల కాలం నుంచి చింతమడుగు చేపల వేట కొనసాగిస్తున్నామని, 2016లో హైకోర్టు ఆదేశాల మేరకు సొసైటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. మండల కేంద్రానికి చెందిన మత్స్యకారులు మా పరిధిలోని గోదావరి తీరంలోకి వచ్చి చేపల వేట చేయడంతో ఉపాధి కోల్పోతున్నామన్నారు. అధికారులు స్పందించి మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోన్: మండలంలోని సిద్దులకుంట గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విశ్వా ఆగ్రో టెక్ సంయుక్తంగా పసుపు, మొక్కజొన్నలో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలు, కల్తీ సేంద్రియ ఎరువుల కట్టడి గురించి వివరించారు. ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు పొందాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం పెరగాలన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ వాటి మోతాదు అందులో ఉన్న పోషకాల గురించి విశ్వా ఆగ్రోటెక్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పీవీ రాజు వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వా ఆగ్రోటెక్ సంస్థ సీఈవో సుభాష్, మేనేజర్ కృష్ణ, ఏవోలు వినోద్ కుమార్, వికార్ అహ్మద్, నాగరాజు ఏఈవోలు అశోక్‌కుమార్, ప్రగతి, ఉమా మహేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

భలే మజా.. తాటి ముంజ



తాటిముంజలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి

- రూ.వందకు డజన్ చొప్పున విక్రయం
- ఉపాధి పొందుతున్న కడెంవాసులు

భైంసాటౌన్/ నిర్మల్‌ఖిల్లా: ఓవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదైనా చల్ల చల్లగా, ఆరోగ్యానికి మేలు చేసేవి తినాలని అనుకుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో తాజా.. తాజా తాటి ముంజలు నోరూరిస్తున్నాయి. కడెం ప్రాంతంలో ఎక్కువగా తాటి ముంజలు ఉండడంతో అక్కడివారు భైంసా పట్టణానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, మార్కెట్ ప్రాంతంలో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజులో రూ.10–15వేల వరకు గిరాకీ అవుతోందని, ఒక్కొక్కరికి రూ. వెయ్యి నుంచి రూ.2వేల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు. పట్టణవాసులకు సైతం తాటి ముంజలు తక్కువ ధరకే లభిస్తుండడంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

గిరాకీ బాగుంది



వేసవిలో తాటి ముంజలకు గిరాకీ బాగుంటుంది. మా ప్రాంతం నుంచి ప్రతిరోజు ఆటోలో తెచ్చి ఇక్కడ అమ్ముతున్నాం. ఏప్రిల్, మేలో మాత్రమే గిరాకీ ఉంటుంది. రోజుకు రూ.15 వేల వరకు గిరాకీ అవుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు గిట్టుబాటు అవుతుంది.

– ఉదయ్ భాస్కర్, నచ్చన్ ఎల్లాపూర్

ప్రతీరోజు వస్తుంటాం..



తాటి ముంజల సీజన్‌లో ప్రతీరోజు ఆటోలో తెచ్చి విక్రయిస్తున్నాం. రూ.వందకు డజన్ చొప్పున అమ్ముతున్నాం. తాజా ముంజలు కావడంతో జనాలు కూడా కొనుక్కునేందుకు ఇష్టపడుతున్నారు. గిరాకీ బాగుంటోంది.

– దిలీప్, కడెం మండలం

అకాల వర్షం.. అతలాకుతలం



కొట్టుకుపోయిన వరి ధాన్యం



తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

- తడిసిన వరి ధాన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: మండలంలో కురిసిన అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వరి కోస్తూ.. ధాన్యం ఆరబెడుతున్నారు. కొందరు రైతులు నాలుగు రోజుల నుంచి ఆరబెట్టిన ధాన్యం తేమ శాతం రావడంతో బుధవారం నింపేందుకు సంచులు తీసుకున్నారు. అంతలోనే మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత రాత్రి 1.50 గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పొట్టపెల్లి, లక్ష్మణచాంద, పీచర, రాచాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం తడిసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఖానాపూర్: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. అధికారుల తీరు కారణంగానే తాము నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం నింపేందుకు గన్నీ సంచులు ఇవ్వకపోవడంతో పాటు వాటిని తూకం వేసేందుకు సరిపడా హమాలీలు లేకపోవడంతో కొనుగోలులో జాప్యం జరిగి నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత ఉండడంతో సకాలంలో తూకం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. క్వింటాలుకు మూడు కిలోలు అదనంగా తూకం చేస్తూ బహిరంగ దోపిడికి పాల్పడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆపరేషన్ సిందూర్'పై సంబురాలు



నిర్మల్ చైన్‌గేట్: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఇండియన్ ఆర్మీ తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ఆకస్మిక వైమానిక దాడులు చేయడం భారతీయుల విజయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ వైమానిక దాడులు చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట పటాకులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం ప్రతీకారం తీర్చుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. పార్టీ నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, నాయకులు రావుల రాంనాథ్, మెడిసిన్ రాజు, అలివేలు మంగ, కమల్ నయన్, రాచకొండ సాగర్, ఒడిశాల అర్జున్, రజిని, కార్తిక్, అరవింద్, దశరథ్ పోశెట్టి, సుధాకర్, నరేశ్, రాజు, భరత్, భూపతిరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక జగన్నాథ్ రావు చౌరస్తాలో పటాకులు పేల్చారు. జాతీయ జెండా ప్రదర్శిస్తూ స్వీట్లు తినిపించుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్, మండలాధ్యక్షుడు ఉపేందర్, పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు రాజేశ్వర్, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేశ్, మురళి, సురేందర్, సందీప్ తదితరులున్నారు. 0

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

కుభీర్: మండల తహసీల్దార్ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు సొంత భవనం లేదన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పనులు నాణ్యతో చేపట్టాలన్నారు. అదేవిధంగా 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్, భైంసా మార్కెట్ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, రాజేష్ బాబు, బోయిడి, విఠల్, నగేశ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సోన్ మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2014– 15 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. ఉపాధ్యాయులను సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు వేసుకొని సందడిగా గడిపారు. – సోన్

విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్ (జి): డాక్టర్ విశారదన్ మహరాజ్ లక్ష కిలో మీటర్ల మాభూమి రథయాత్రను నిర్మల్ జిల్లాలో విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రవీందర్ మహరాజ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని షాదీఖానాలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నిర్మల్ జిల్లాలోని ప్రతీ గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీలను ఏర్పాటు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజు, కల్లూరు సుధాకర్, సోన్న భూమేష్, రాములు, కత్తి శేఖర్, బొడ్డు ముత్యం, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

తానూరు: మండలంలోని భోసి గ్రామంలోని పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తొట అమృతం లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడంతో బుధవారం గ్రామకమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం అయనకు లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా నియమించిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉత్తం బాలేరావ్, ఆనంద్, రాజ్‌కుమార్, హన్మండ్లు, శివనాథ్, గంగాధర్, బాలాజీ పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు

కడెం: మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో బుధవారం మేడే వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఖానాపూర్ ఏరియా కమిటీ సభ్యుడు డాకురి తిరుపతి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ఉపాధిహామీ పనుల్లో కోత విధించి కూలీల పొట్ట కొడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో దోసండ్ల భూమేశ్, చంటి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హజారే శంకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల7 నుంచి 9వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు రావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు జక్కుల సత్తెన్న, చెన్ను మల్లేశ్‌లు బుధవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈసందర్భంగా సతీశ్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు రూ. 3వేలు విరాళంగా అందజేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి



మహేందర్‌ను సన్మానిస్తున్న వేణుగోపాలచారి

దిలావర్‌పూర్: కాల్వ అటవీ పరిసర ప్రాంతంలో వెలిసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఆలయ కమిటీ చైర్మన్ అంగూరి మహేందర్ అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నూతన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ కేంద్రమంత్రి, సీనియర్ నేత వేణుగోపాల చారి నూతన చైర్మన్ అంగూరి మహేందర్‌ను ఘనంగా సన్మానించారు. మహేందర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో మరిన్ని పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. పాలక మండలి సభ్యులుగా గుమ్ముల చిన్న నర్సయ్య, గట్టు కాశీనాథ్, జాదవ్ పుష్ప, వన్నెవన్నె శివకుమార్, గడ్డం నర్సారెడ్డి, పూదరి శివకుమార్, దాసరి శ్రీకాంత్, గైని దేవేందర్, సూర నవీన్‌కుమార్, ఆకారపు లక్ష్మణ్, నూతి కట్టు సాయన్న, చిన్నోల్ల లక్ష్మణ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సోమ భీంరెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కొమ్ముల దేవేందర్‌రెడ్డి, చిలుక రమణ, అక్షర అనిల్, తక్కల సాగర్‌రెడ్డి, అర్గుల రమణ, కట్కం రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసారూరల్: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఐకేపీ కార్యాలయంలో పట్టణం, మండలానికి చెందిన 116 మంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పడుచులకు పెళ్లిలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పేరిట అందిస్తున్న ఆర్థిక సహాయం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సొలంకి భీమ్‌రావు, రావుల రాము, సుష్మారెడ్డి, ఎనుపోతుల మల్లేశ్, పండిత్ రావు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన దినోత్సవం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు జరిపి యజ్ఞం నిర్వహించారు. ఆలయ పూజారులు వీర బ్రహ్మంగారి జీవ సమాధి జీవత చరిత్రను భక్తులకు తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, సెక్రటరీ రాకేశ్, కోశాధికారి సుద్దాల సత్యనారాయణ, సభ్యులు గోపీ, గణేష్, గవాస్కర్, రాజశేఖర్, అజయ్, వేణు, సాగర్, నరేశ్, సత్యం, రవి పాల్గొన్నారు.

బీరప్ప దేవుని ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో గల బీరప్ప దేవుని ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పలు పూజా కార్యక్రమాలతో పాటు నాగవెల్లిని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాలకు కుర్మ సంఘం నాయకులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బ్రహ్మంగారి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల కల్యాణాన్ని బుధవారం విశ్వకర్మ కులస్తులు ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా హోమం నిర్వహించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం సభ్యులు వడ్ల సత్యానారాయణ, అవుసరి రాములు, సిపురం గంగాధర్, శ్రీనివాస్, ప్రశాంత్, స్వరాజ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

ముధోల్: మండలానికి గురువారం ఎమ్మెల్యే రామరావుపాటిల్ రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటలపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని చేపట్టనుందని, ఇందులో భాగంగా నిర్వహించనున్న రైతుల ముంగిట్లో వ్యవసాయం అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్,, బ్రహ్మన్‌గావ్ గ్రామాల్లో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేయనున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ బోడికే సాయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 37 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలన్నారు.

నేడు విగ్రహ పునఃప్రతిష్ఠాపన

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆలయంలో తాతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలని శాలివాహన (కుమ్మర) సంఘం నాయకులు కోరారు. బుధవారం పండితులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, తదితరులు పూజలు చేశారు. అంతకు ముందు పట్టణంలోని లక్ష్మి వెంకటేశ్వర ఆలయం నుంచి గోదావరి తీరం వరకు విగ్రహ ప్రతిమలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గురువారం జరిగే విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు విన్నవించారు.